క్లుప్తంగా

వసతి గృహానికి వితరణ

సీటీఆర్ఐ: స్థానిక గణేష్ చౌక్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల సౌకర్యార్థం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ (రాజమండ్రి) సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేసింది. వసతి గృహంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు లేవని వార్డెన్ సత్యకుమారి వాసవీ క్లబ్‌కు విన్నవించగా జెడ్‌సీ బ్రహ్మ గిరీష్ చేతుల మీదుగా వాటిని మంగళవారం పంపిణీ చేశారు. అలాగే ఐదుగురు పేద ఆర్యవైశ్య విద్యార్థులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ బచ్చు వెంకట సూర్యనారాయణమూర్తి, సెక్రటరీ బత్తుల శ్రీరాములు, ట్రెజరర్ పింజెర్ల నరసింహగుప్తా, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: మహిళా సాధికారత, అభ్యున్నతికి స్వర్ణాంధ్ర సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని లయన్స్ 316బీ జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు అన్నారు. ఆ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాంగణంలో మంగళవారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్లుగా నిరాశ్రయులకు సేవలందించడం, మహిళలను ప్రోత్సహించడం స్వర్ణాంధ్ర సంస్థ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ శ్రేణి సాధించిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, మార్కెటింగ్ నిపుణురాలు తమ్మన సూర్యకుమారి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు తోడ్పాటు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు తోడ్పాటు అందిస్తామని జన్ సాహస్, సేఫ్‌వే జాతీయ సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ మేరకు తాము అందించే సహకారంపై మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లు, పంచాయతీ పాలకవర్గానికి అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలోని కడియపలంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట గ్రామాల పరిధిలో అరవైచోట్ల చెత్త అధికంగా పోగవుతున్నట్లు తమ బృందం గుర్తించిందని జన్ సాహస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పట్నాయక్ తెలిపారు. స్థానిక నాయకులు మార్గాని ఏడుకొండలు మాట్లాడుతూ ఇరుకువీధుల్లోకి వెళ్లి చెత్తను సేకరించే విధంగా మినీ ట్రాక్టర్‌ను సమకూర్చాలని ఆ సంస్థ ప్రతినిధులను కోరారు. సమావేశంలో ఉపసర్పంచ్ పాటంశెట్టి రాంజీ, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, రిసోర్స్ పర్సన్ చిట్టి శంకర్, వెల్ఫేర్ సెక్రటరీ రమేష్, సంస్థ ప్రతినిధులు అందుకూరి తేజ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం

- ఎంపీ భరత్‌రామ్
- పలు ఆటోస్టాండ్ల ప్రారంభం



ఆటోస్టాండ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ఆటో కార్మికులు తమ కుటుంబ పోషణ కోసం రాత్రింబవళ్లు ఎంతో కష్టపడతారని, అదే సమయంలో ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని పలు జంక్షన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్లు, యూనియన్ల ఆవిర్భావ కార్యక్రమాల్లో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ మీకు ఎటువంటి సమస్య వచ్చినా నేను ఉన్నాననే సంగతి మర్చిపోవద్దన్నారు. దేవీచౌక్ సెంటర్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద 60 ఆటోల స్టాండ్, నందం గనిరాజు జంక్షన్, ఎస్కేవీటీ స్కూల్ మాగ్నా హాస్పిటల్ వద్ద 30 ఆటోల స్టాండ్, అదే రోడ్డులో ఫస్ట్‌ప్లస్ హాస్పిటల్ వద్ద 20 ఆటోల స్టాండ్, ఉమెన్స్ కళాశాల వెనుక వైపు గేట్ వద్ద గౌతమ్ హాస్పిటల్ వద్ద 40 ఆటోల స్టాండ్, వీఎల్‌పురం జంక్షన్ సిద్ధార్థ హాస్పిటల్ వద్ద 35 ఆటోల స్టాండ్‌ను ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



చైతన్యస్కూల్లో విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం



గోపీకృష్ణ స్కూల్లో సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవరం ఘనంగా నిర్వహించారు. లాలాచెరువు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. హెచ్‌ఎం ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గాంధీపురంలోని గోపీకృష్ణ ఇంగ్లిషు మీడియం స్కూలులో విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కరస్పాండెంట్ కోనేటి ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు. శాస్త్ర విజ్ఞానం ఆధునిక మానవ జీవన విధానాన్ని ఎంతో ప్రభావితం చేస్తోందని కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.దుర్గాప్రసాద్ అన్నారు. ఆ పాఠశాలలో సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో సైన్స్‌డే నిర్వహించారు. డెల్టా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిపారు.

చైతన్య పాఠశాలలో..

సీతంపేటలోని చైతన్య పాఠశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మల్లికార్జున, భౌతికశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరనాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఏజీఎం వైఎస్.శ్రీనివాస్, రీజినల్ కోఆర్డినేటర్ జేకే.శ్రీనివాస్, ఆర్ఐ వై.రామాంజనేయులు పాల్గొన్నారు.

కడియం: స్థానిక హైస్కూల్లో హెచ్‌ఎం టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్ సీవీరామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా బహుముఖ ప్రజ్ఞాశాలి గొల్లపల్లి సత్యనారాయణను ఘనంగా శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

విజ్ఞాన శాస్త్రానికి ఎంతో ప్రాధాన్యం

రాజమహేంద్రవరం రూరల్: ఆల్కాట్‌తోటలోని సత్యసాయి గురుకులంలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గురుకులం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఏ.శ్యాంసుందర్, కె.గుర్రయ్య ప్రారంభించారు. ఇందులో భాగంగా సుమారు వంద మంది విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు.

ఎస్‌కేఆర్‌లో ఫియస్తా 2023

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫియస్తా 2023 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో జరిగిని ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రత్యేక అధికారి డాక్టర్ సీహెచ్ కృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఎలా స్వయం ఉపాధిని కల్పించుకోవాలో తెలియజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థినులు వివిధ రకాలైన వ్యాపారాలు నిర్వహించడం ద్వారా వాటిలోని మెలకువలు, కష్టనష్టాలను స్వయంగా అవగాహన చేసుకుని, భవిష్యత్తులో జీవనోపాధిని కల్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇ.కీర్తి, కె.రమాదేవి, డాక్టర్ ఎం.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- నాలుగు గ్రామాల కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



జేగురుపాడులో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. జేగురుపాడు సచివాలయం సెంటర్‌లోనూ, మాధవరాయుడు పాలెం సంగిత వెంకటేశ్వరరావు ఇంటి వద్ద, కడియపుసావరంలో మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు ఇంటి వద్ద, దామిరెడ్డిపల్లిలో పార్టీ నాయకుడు ముద్రగడ మహేష్ ఇంటి వద్ద ఆయా గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. చందన మాట్లాడుతూ గృహసారథులు తమ పరిధిలోని ప్రతి కుటుంబంతోనూ నేరుగా మాట్లాడాలన్నారు. తద్వారా వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

మండలంలోని జేగురుపాడులో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో రంకిరెడ్డి వీరకృష్ణ, బోణం రవికుమార్, ఆకుల నారాయుడు, పల్ల రత్నం, బాబీ తదితరులు జనసేన, టీడీపీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి చందన నాగేశ్వర్ పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు.

సంక్షిప్తంగా..

మార్చి 5న బ్రాహ్మణ మహిళా సదస్సు

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో మార్చి 5న రాజమహేంద్రవరం శివారు కాతేరు వద్ద ఉన్న వెంకటాద్రి గార్డెన్స్‌లో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 23 లక్షల మంది సమాఖ్య బలం ఉన్నప్పటికీ ఏ రాజకీయ పార్టీ తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ముఖ్యఅతిథిగా శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ రమ్యానంద భారతి పాల్గొని అభిభాషణ చేస్తారన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ రాష్ట్ర సదస్సులో తెలంగాణ శాసన మండలి సభ్యురాలు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె వాణీదేవి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ పాల్గొంటారన్నారు.

కొనసాగుతున్న దీక్ష

ప్రకాశం నగర్: పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అన్నారు. పేపర్ మిల్లు ఎదుట కార్మికుల రిలే నిరాహార దీక్ష మంగళవారం 49వ రోజుకు చేరుకుంది.

ఘనంగా టైలర్స్ డే

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలో లక్ష్మీగణపతి దర్జీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు తాడిచర్ల ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సంఘం గౌరవాధ్యక్షుడు భట్లంకి ప్రకాష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు హాజరయ్యారు.

కాతేరులో..

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో మంగళవారం రాజమహేంద్రవరం దర్జీ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రపంచ దర్జీ దినోత్సవం ఘనంగా జరిగింది. బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నికృష్ణ, జిల్లా కార్యదర్శి రాజేష్, రైల్వే దినేష్ లాల్, దర్జీ సంఘ్ అధ్యక్షులు దొడ్డి రాజబాబు, సత్యనారాయణ, మురళి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రకాశం నగర్: ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం గోకవరం బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

మెరుగైన న్యాయసేవలు

కంబాలచెరువు: న్యాయసేవలు అవసరమైన వారికి మెరుగైన, సత్వరమైన పరిష్కారం చూపించడం ప్యానెల్ లాయర్ల ప్రధాన కర్తవ్యమని ఎనిమిదో అదనపు జిల్లా న్యాయమూర్తి పీఆర్ రాజీవ్ అన్నారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్యానెల్ లాయర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ సభ్యులకు మంగళవారం మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై అవగాహన

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు, స్కూల్ కాంప్లెక్స్‌లకు, ఎంఈఓ కార్యాలయాలకు విడుదల చేసే నిధులను పీఎఫ్ఎంఎస్ ఖాతాలలో జమ చేస్తోందని అర్బన్ రేంజ్ డీఐ కార్యాలయ అకౌంటెంట్ సంపత్ తెలిపారు. స్థానిక డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్‌లో ప్రధానోపాధ్యాయులకు పీఎఫ్ఎంఎస్ ఖాతా (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) నిర్వహణ, లాగిన్, పాస్‌వర్డ్ ఏర్పాటుపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు, ఒక సహాయకుడు ఈఖాతా నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాల పంపిణీ

కడియం: మండలంలోని బుర్రిలంకలో మంగళవారం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ధవళేశ్వరం: స్థానిక లక్ష్మీనరసింహ నగర్‌లోని షిరిడీ సాయి మందిరం అభివృద్ధి పనులకు సద్గురు షిరిడీ సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవత సూర్యనారాయణ రూ.16 వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. గర్భగుడిలో టైల్స్ ఏర్పాటుకు ఈ విరాళాన్ని ఇచ్చినట్టు తెలిపారు. ఈ మేరకు చెక్కును ధర్మకర్త జి.శ్రీనివాసరావు (వాసు)కు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి దేవత రామ్మోహన్‌రావు, వైస్ చైర్మన్ దేవర కొండబాబు, డైరెక్టర్ పీవీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ మోరంపూడి, సాయి నగర్, అరవింద్ నగర్, గాదాలమ్మ నగర్, గణేష్ నగర్, అల్కాపురి లేఅవుట్, బుచ్చయ్య నగర్, హుకుంపేట, మీనాక్షి లేఅవుట్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.